
# రెండు ముఖాలు



- రేణుక అయోలా

క్రేన్ కథలపోటీలో
సాధారణ ప్రచురణకు
స్వీకరించిన కథ

అదొక చిట్టడవి, నలుమూల పరుచుకున్న ఆకుపచ్చని తివాచిలా ఉన్న అడవిలోకి ఆకుల మధ్యలోనుంచైనా దూరాలని ప్రయత్నిస్తున్న సూర్యకిరణాలు చిన్నచిన్న అద్దాల్లా నేల మీద తళుక్కు తళుక్కు మంటూ మెరుస్తున్నాయి. కొండ వాగు తుళ్ళుతూ, ఎగురుతూ అల్లరిచేస్తూ నదిలోకి కలసిపారుతోంది. గండు కోయిల కొమ్మెక్కి కూర్చుని గొంతు సవరించుకుంటూ రాగాలు తీస్తోంది. చిన్ని పాలపిట్ట రివ్వురివ్వున ఎగురుతోంది. దానికి వేగం ఎక్కువ, అది ఎగురుతూ పువ్వులమీద వాలుతుంటే పిట్ట కనిపించకుండా దాని ఒంటిరంగు నీలంగా మెరుస్తోంది. రంగు రంగు సీతాకోక చిలుకలు నేలమీద రాలిన పువ్వుల్లా అందాలొలికిస్తున్నాయి.

ఆరోజు ఆ అడవికే కొత్త అందాలు వచ్చినట్లు పండుగ సంబరం కనిపిస్తోంది. ప్రకృతి అంతా కూనిరాగాలు తీస్తున్నట్లుంది, అసలే అందమైనఅడవి ఆరోజు మరీ తీరికగా అలంకరించుకున్నట్లుంది.

అందులో ఓ చిన్ని "జింకపిల్ల" పెద్ద పెద్ద కళ్ళతో, పసుపు పచ్చని ఒంటితో లేత అందాల ఆ జింకకి కాస్తంత కవిత్వధోరణి ఉంది. గడ్డి చిగురులు కొరుకుతూ గంతులేస్తుంటే చాలు దానికి కవిత్వం అలా అలా ప్రవాహంలా వస్తుంది. కొండ వాగులో నీళ్ళు తాగుతున్నా, పచ్చిక బయళ్ళ మీద నడుస్తున్నా దానికి కవిత్వం ఉరకలేస్తూ వస్తుంది. ఆ భావావేశంలో చక్కటి పద్యాలు అల్లీ పాటలు కూడా పాడుతుంది.

తన కవిత్వాలను దాచుకోలేక, స్నేహితురాళ్ళ మధ్య ఉన్నప్పుడు వారికి తన పద్యాలను, కవిత్వాన్ని వినిపించేది. వాళ్ళంతా "సెహభాష్" అని మెచ్చుకొని వీలైతే మళ్ళీ మళ్ళీ వినిపించమని అడిగి విని చాలా ఆనందించేవారు. ఆకాశంలో చుక్కల్ని లెక్కపెడుతూ, వెన్నెల్లో తడుస్తూ అలా పచ్చగడ్డి మీద వాలి పద్యాలు అల్లుకునేది. వాటిని కాగితం మీద పెట్టి, నల్ల నక్షత్రాల్లా పేర్చబడిన కవిత్వ పద్యాలు చూసి ఆనందించేది. సరిగ్గా అప్పుడే స్నేహితురాళ్ళంతా ఓ మంచి సలహా ఇచ్చారు. ఈ పద్యాలనీ కలిపి ఓ పుస్తకం వేయించు. అది శాశ్వతంగా నీకు కీర్తిని తెచ్చిపెడుతుందని!! వాళ్ల సలహా విని చాలా ఆనందం వేసిందా "జింక పిల్ల"కి. ఎలాగైనా తానో మంచి పుస్తకం వేయాలని నిశ్చయించుకుంది. కవిత్వాలన్నీ ఓ చోట చేర్చి అందమైన పుస్తకంగా తీర్చిదిద్దింది. ప్రకృతి ఒడిలో దాగి ఉన్న పూలతోటలా ఆ పుస్తకం తళతళలాడుతూ తయారు అయ్యింది.

ఓ రోజు మధ్యాహ్నం అడవిలో ఉన్న సెలయేరు ప్రక్కన సమావేశమయ్యాయి జింకపిల్లలన్నీ. అందమైన లేడికూనలన్నీ ఒక చోట చేరేసరికి అడవి అంతా పులకించిపోయింది. వయ్యారాలు ఒలకపోస్తూ, చెంగు చెంగుమంటూ గంతులేస్తూ చర్చలు కొనసాగించాయి. ఆ చర్చలో ఎవరెవరిని పుస్తక ఆవిష్కరణ రోజు పిలవాలని మాట్లాడుకున్నాయి.

ప్రక్కన ఉన్న పెద్ద అడవిలో కొండ గుహలో ఉన్న సాహిత్య రంగంలో విశేషకృషి చేసి కవిత్వాన్నంతా కాచి వడపోసిన పెద్దలు అయిన పెద్దపులి, సింహాలని పిలవాలని నిశ్చయించుకున్నాయి. ఇంకా ఎన్నో పురస్కారాలు అందుకున్న "నక్కబావలని" మరెంతో కవిత్వాన్ని రాసి, మదించి కవిత్వానికే కొత్త అందాలు తెచ్చిన "ఏనుగు పెద్దన్న"లని అందరినీ పిలవాలనుకున్నాయి. అందరికీ ఉత్తరాలు అందిస్తూ వార్తలు

చేరవేసే "కోతిబావ"లు ఎలాగోలా పిలవాలి వాళ్ళు వార్తలు అందించకపోతే అడవిలో అటు వార్త ఇటు వాళ్ళకి తెలియదు. అంతటి వార్తాదిట్టలు కోతిబావలు, ఇలా అందరినీ పేరున పిలవాలని ఒక లిస్టు తయారుచేసుకుని రడీగా పెట్టుకున్నాయి.

ఇంత పెద్ద పెద్ద రచయితలందరూ "నేను పిలిస్తే వస్తారా" నన్న సందేహం వెలిబుచ్చింది "చిన్న జింక". ఎందుకు రావు నువ్వు పిలవాలే గాని అంది కొంటె కోణంగి అయిన ఓ లేడికూన. అందరూ పక పకా నవ్వుకున్నారు. దానిమాటలు పట్టించుకోకు అది అంతా ఓ కొంటెపిల్ల అంది లేడి. ముందు నువ్వు ఏరోజున పిలవాలో నిశ్చయించుకో అంది. పున్నమినాడు పిలుస్తాను, నాకు వెన్నెల అంటే చాలా ఇష్టం అంది "చిన్నజింక". ఇంకేం వెన్నెల్లో పుస్తక ఆవిష్కరణ చాలా బాగుంటుంది. ముఖ్యంగా నీ పద్యాలు అన్నీ వెన్నెల్లో, తడుస్తూ, ఈ పచ్చిక బయళ్ళ మీద నిద్రపోకుండా రాసినవే కదా!! అన్నారంతా ఏకగ్రీవంగా. కాని చిన్న .జింక, నువు పిలిచేవాళ్ళంతా సాహిత్యంలో పండితులు. నీకు చాలా మంచి మంచి సలహాలు ఇస్తారు. నీపుస్తకాలకో విలువ వస్తుంది, అంది మరో లేడికూన.

అందుకేగా నాకు భయం,నాపద్యాలు చూసి ఏమనుకొంటారోనని అయినా నాకు నమ్మక ముంది. నాది చాలా మంచి కవిత్వమని అంది చిన్న జింక.'' కళ్ళని అదోలా తిప్పుతూ"--

సరే పదండి అందరం పోదాం. మన అమ్మలు ఎదురు చూస్తా ఉంటారు.అన్నాయి అన్ని లేడి కూనలు.చల్లటి సెలఏటి నీళ్ళు తాగి. పచ్చటిగడ్డి కొనలు కొరికాయి. గాలిలోకి లేచి నాట్యం చేస్తునట్లే చెంగు చెంగు మంటూ దూకూతూ,నల్లటి పెద్ద పెద్ద కళ్ళని అటూ ఇటూ తిప్పుతూ ఉరకలు వేస్తు ఇంటి దారి పట్టాయి. వీటి సందడి చూసిన చెట్ల మీద పక్షులన్నీ ఉలిక్కిపడ్డాయి. కువ కువ మంటూ సందడి చేసాయి. కొన్ని పిట్టలు కూనిరాగాలు తీసాయి. కొన్ని గొంతు సవరించుకుని సరిగమలు పాడాయి. అడవి అంతా రాగలహరిలో గానాల విందులో మునిగిపోయింది.

ఆరోజు రానే వచ్చింది. పున్నమి చంద్రుడు పిలవకపోయినా ఆసమావేశానికి తానే పెద్ద అతిథి అన్నట్లు తన అందాన్నంతా ఆరబోసి స్వచ్ఛమైన వెండి వెలుగులు అడవి కంతా పంచాడు. పక్కనున్న సెలఏటి తరగల మీద చిన్న చిన్న వెండిరేకులు రాలి పడి తళుక్కు మన్నట్లు నదిఅలలమీద తేలుతునే వెన్నెల నదితొ పాటు కలసి ప్రయాణిస్తుంది. వెన్నెల తెల్లగా చల్లగా హాయిగా అందర్నీ కవ్విస్తోంది. అంత చీకటి వాతావారణంలో లేడి కూనలన్నీ ఇంకా అందంగా తయారు అయ్యి అందర్నీ ఆహ్వానిస్తూ హడావిడి చేస్తున్నాయి.

పచ్చటి కొండగుట్టమీద గడ్డిమీద అందరూ కూర్చున్నారు పెద్దపులి,సింహాలు గంభీరంగా తీక్షణంగా చూస్తూ, ఆవెన్నెల రాత్రిలో హాయిని అనుభవిస్తూ కూర్చున్నాయి. ప్రక్కనే నక్కబావలంతా మెల్లగా సరదాగా .జోకులు వేసుకూంటూ పెద్దపులి, సింహాల ప్రక్కన భయం భయంగా కూర్చున్నాయి, గుంట నక్కలు, తోడేళ్ళు, ఏనుగులు అంతా అంతా సాహిత్యకారులే కవిత్వంలో మంచిపేరు సంపాదించిన వాళ్ళే. అందరిలో ఎవరిస్థలంలో వారు కూర్చొని ఒకరిని ఒకరు పలకరించు కుంటున్నాయి. నవ్వుకుంటున్నాయి.

సభా ప్రారంభానికి వచ్చిన లేడి కూనలన్నీ ఆనందంతో అటూ ఇటూ తిరుగు తున్నాయి. తమ స్నేహితురాలి పుస్తకావిష్కరణ. అందుకనే వారి ఆనందం అంతాఇంతా కాదు. అసలే అందమైన లేడికూనలు ఇంకా అందంగా తయారు అయ్యాయి. అందరిని పూలతో సత్కరించి ఆహ్వానించాయి.

పెద్దపులి, సింహం, ఎవరి ఆలోచనలో వాళ్ళు ఉన్నారు. మాటిమాటికి చేతికున్న గడియారం వైపు చూసుకుంటున్నాయి. అసలైన పెద్దపులి అడవికంతా రారాజు అయిన తెల్లపులి రావాలి. అందుకే అందరూ ఎదురు చూస్తు న్నారు. పెద్దపులికి, సింహానికి ప్రక్కన ఉన్న ఇంకో అడవిలో మరో సాహిత్య కార్యక్రమం ఉంది అందుకని ఆందోళనగా ఆత్రుతగా, తెల్లపులి గురించి ఎదురు చూస్తున్నాయి. కళ్ళముందు తుళ్ళుతూ గెంతుతూ ఆనందంగా అటూ ఇటూ తిరుగుతున్న జింకలను చూస్తుంటే నోరు ఊరిపోతుంది. అయినా తమాయించు కొని హుందాగా కూర్చున్నాయి.

తెల్లపులి రాగానే స్వాగతగీతాలు పాడాయి అందాల రామచిలుకలు. వినసొంపైన పద్యాలపుస్తకం ఆవిష్కరింపబడింది. "తెల్లపులి" చేతులమీదుగా. చిన్ని జింక ఆనందం అంతా ఇంతా కాదు. తనకు ఇలాంటి రోజు వస్తుందని కలలో కూడా అనుకోలేదు. అందరి హర్షద్వానాల మధ్య పుస్తకం "తెల్లగులాబిలా" స్వచ్ఛంగా మెరిసింది అందరి చేతుల్లో.

చిన్ని జింకను ఆశీర్వదిస్తూ అందరూ పుస్తకాన్ని, పుస్తకంలో ఉన్న పద్యాలనీ పొగి డాయి. మంచి భవిష్యత్తు ఉందని ఎలుగెత్తి వాదించాయి. పెద్దపులి. సింహాలు ప్రసంగిస్తూ ఇలాంటి ఎన్నో పుస్తకాలు రాయమ్మా చిన్ని జింకా అంటూ సలహా ఇచ్చాయి. తెల్లపులి పుస్తకాన్ని అటూ ఇటూ తిప్పి చాలా బాగుందని మెచ్చుకుంది. అందులో ఉన్న రెండు పద్యాలు పాడివినిపించింది. అందరూ ఈ చిన్ని జింకకి మంచి భవిష్యత్తు ఉందని పొగిడి సభ ముగించు


**కొత్త ఇల్లు కోరుకునే వారికి**

**గొప్ప అవకాశం**

అందమైన ఇండ్లను నిర్మించాలన్నా
పాతవాటికి మెరుగులు దిద్ది కొత్తదిలా
మెరవాలన్నా కాంట్రాక్ట్ పద్ధతిపై
క్వాలిటీ తగ్గకుండా అనుకున్న టైంకి
పూర్తిచేసి పూర్తిస్థాయి
పటిష్టమైనటువంటి, ఆధునిక
సౌకర్యాలతో కూడిన భవంతుల
నిర్మాణానికి సంప్రదించండి

**సైకం ఉదయ భాస్కర్**
**సెల్: 94415 18403**

కొని ఎవరి దారిన వారు వెళ్ళిపోయారు.

స్నేహితురాళ్ళంతా శుభాకాంక్షలు తెలిపి ఇళ్ళదారి పట్టాయి. అందరూ వెళ్ళి పోయాక అడవిలో ఒంటరిగా మిగిలిపోయిన చిన్నజింక ఉత్సాహంతో, సంతోషంతో ఉబ్బి తబ్బియిపోతూ ఆ వెన్నెట్లో అలాగే నిలబడి పోయింది. తన అదృష్టానికి పొంగిపోయింది. పున్నమి చంద్రుడు మరింతగా వెలిగిపోతూ పండువెన్నెలని విరజిమ్మాడు. పక్కనే ఉన్న కొలనులో నిశ్చలంగా ఉన్న నీటిలో కందకుండా ఉన్న చంద్రబింబం ఆకాశం మీదనుంచి వచ్చి నీటిమీద నిల్చుందా అన్నట్టు అనిపించింది. ఆకాశం మీద ఒకటి నీటి మీద ఒకటి రెండు చందమామలు. ఈనాడు తనకోసమే అన్నట్లుగా వచ్చాయి. అనుకుంది బావోద్వేగంతో. ఇలా అనుకుంటూ ఆలోచిస్తూ ఉహల్లో తేలిపోతూ అలా పచ్చిగడ్డి మీదే వాలిపోయింది.

వారంరోజుల తరువాత ఓ అందమైన సాయంకాలం "చిన్ని జింక" అడవిలో విహరిస్తూ, కవిత్వాలని మనసులో అల్లుకుంటూ తిరుగు తోంది. ఇంతలో హఠాత్తుగా సాహిత్య పెద్దలు అయిన పెద్దపులి,సింహాలు,తీరిగ్గా కొండ మీద కూర్చుని చర్చించుకుంటూ కనిపించాయి. చిన్నిజింకకి,వాళ్ళకి కనిపించకుండా వాళ్ళమాటలు వినాలనుకుని చాటుగా దాక్కుని వాళ్ళు మాట్లాడుకునే మాటలు వింది.

మొన్న వారం జరిగిన ఆ చిన్ని జింక పుస్తకం మీద చాలా బాగా చర్చలు జరిపావు, ఆ పుస్తకం బాగా చదివావా, అంత బాగుందా అని అడిగింది సింహం. ఏం నువ్వు చదవలేదా అంది పులి. నేను చదివాను అప్పటి కప్పుడు అయినా నా మొఖంలా వున్నాయి పద్యాలు, అవీ ఒక కవితలేనా, నాకస్సలు నచ్చలేదు అంది పులి. మరి అంతగా పొగిడావు అంది సింహం. ఆ ఏదో బాగుందదని పొగి డాను, అసలు పుస్తకం పూర్తిగా చదివానా, పాడా!! అయినా నాకంత తీరికెక్కడిది, అలా అందరి పుస్తకాలు చదువుతూ కూర్చొడమేనా నా పని. ముందో పద్యం ఆఖరునో పద్యం చదివా!! అంది పగలబడినవ్వుతూ. సింహం కూడా పక పకా నవ్వింది. తరువాత వాళ్లు ఇంకా చాలా విషయాలు మాట్లాడుకున్నారు.

కాని ఆ మాటలు విన్న "చిన్ని జింక" గుండె బద్దలై పోయింది. హతాశురాలై పోయింది. ఎంతో మనసు పెట్టి రాసుకుంది. ఒకొక్క కవిత ప్రకృతి ఒడిలో ఒక్కొక్క పువ్వుకు వినిపించింది. సెలయేటి గట్టు మీద పాడింది. వాటి గలగలలు తన కవిత్వంలోకి ఎక్కించు కుంది. కోయిల పాటల స్వరాలు వ్రాసుకుంది. సీతాకోకచిలుకల అందాలు అక్షరాలుగా పొదుగుకుంది. మిణుగురుల మిలమిలలు పొందు పరచింది. ఎండాకాలం వేడి గాడ్పులను, వర్షాకాలపు నీటివరదలను, చలికాలపు గడ్డకట్టించే హేమంత సొగసులను పొందు పరచింది. కొమ్మ కొమ్మకి, రెమ్మ రెమ్మకి మొగ్గ తొడిగిన పూలబాసలని, కవిత్వం అంచులకు చేర్చింది. అయినా వీళ్ళకు నచ్చలేదా!! కన్నీళ్లు ఉబికి వచ్చాయి. మనసంతా దిగులుగా అయిపోయింది. పరుగులు పెట్టు కుంటూ వెళ్ళే "చిన్ని జింక" మెల్లగా నడుస్తూ కాళ్ళు ఈడ్చు కుంటూ తన స్నేహితురాళ్ళ దగ్గరికి వెళ్ళింది. దిగులుగా ఉన్న జింకను చూచి అన్నీ అడి గాయి. ఏమయిందని!! తాను విన్నదంతా చెప్పి భోరున ఏడ్చింది. ఈ మాటలు విన్న లేడి కూనలన్నీ కూడా ఆశ్చర్య పోయాయి. అయినా తేరుకుని, వాళ్ళ మాటలు లెక్క చేయకు, నీ పద్యాలు, కవితలు మాకు చాలా నచ్చాయి. తేనెపట్టులాంటి తియ్య దనమున్న నీ కవితలు ఈ అడవిలో మారు మ్రోగాయి. ఏది ఒకవిత పాడు అంటూ బలవంతం చేసాయి. "చిన్ని జింక" మూడు మార్చడానికి ప్రయత్నిస్తూ......

స్నేహితురాళ్ళ మాట కాదనలేక పద్యం వినిపించడానికి గొంతు సవరించుకుంది.

**అడవిలో రెండు చందమామలు**
**ఆకాశాన ఒకటి**
**నీటిలోన ఒకటి**
**నీటిలో చందమామ**
**కలువ భామ కి తోడు**
**నింగిలో చందమామ**
**చుక్కపాపకి తోడు**
**అందరినీ అలరించే నెలరేడు**
**అక్కడా ఉన్నాడు... ఇక్కడా ఉన్నాడు...**

అంటూ పాడింది.

అందరూ "చిన్ని జింక" గొంతులో గొంతు కలిపి కోరస్ లా పాడారు.

అందరూ తనతో పాటు పాట పాడడంతో తన దు:ఖాన్ని మరచిపోయింది. అన్ని లేడి కూనలతో పాటు చెంగు చెంగు మంటూ దూకుతూ, చిక్కటి ఆడవిలోకి వెళ్ళిపోయింది.

మరొక నాలుగురోజుల తర్వాత, కోతిబావ ఓవార్త తీసు కొచ్చాడు. "చిన్ని జింక" కవితల పుస్తకాలు కావాలని...

ఎందుకు అని అడిగింది "చిన్ని జింక".

ప్రక్కన అడవిలో పెళ్ళి జరుగుతోంది. చాలా గొప్పగా జరుగుతోందట. అందులో పేరుమోసిన రామచిలుకల జంట సంగీత కచేరి చేస్తున్నాయి. వాళ్ళ సంగీత కచ్చేరి అంటే అన్నీ అడవులవాళ్ళు తరలి వస్తారు. అదో పెద్ద సంగీతోత్సవం. వాళ్ళు "చిన్ని జింక" కవితలు పాడాలని నిశ్చయించుకున్నాయట. అందుకని "చిన్ని జింక" పుస్తకం కావాలని కోతిబావ తో వార్త పంపాయి.

చిన్ని జింక ఆశ్చర్యపోయింది, తన అదృష్టానికి తానే నమ్మలేక పోయింది. స్నేహితు రాళ్ళంతా ఈ విషయం విని ప్రశంసించాయి. తన దగ్గర ఉన్న పుస్తకం కోతిబావ చేతికి ఇచ్చింది.

దారిలో ఈ వార్త విన్న పులి, సింహం, నక్కలు అన్నీ ఆశ్చర్య పోయాయి. ఏమిటి ఆ పద్యాలు... అందులోనూ రామచిలుకలు కచేరి చేస్తాయా? అవి కచేరి చేస్తే చాలు, ఆ పాటలకు ఎంతో విలువ వస్తుంది. ఇలా అనుకున్న వాళ్ళు వెంటనే మాటలు మార్చాయి, నేను ఆరోజు అనుకున్నాను, ఆ చిన్ని జింక పుస్తకానికి మంచి గుర్తింపు వస్తుందని అందుకే ఆ రోజు స్టేజి మీద అంతగా పొగిడాను. అర్ధం అయ్యిందా అంది పులి సింహం వైపు చూస్తూ. అవును నాకు అలాగే అనిపించింది అంది జూలు దువ్వుకుంటూ సింహం, పులి మాటలకి తాళం వేసింది. వాళ్ళ మాటలు విన్న లేడికూనలన్నీ ముసిముసిగా నవ్వుకున్నాయి.